శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీలు

శామీర్‌పేట, జూలై 19 : శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సందర్శించారు. పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్సైలు, సిబ్బందితో సమావేశమై నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడద ఉంటే ఫోన్ చేయండి..

- జవహర్‌నగర్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్, జూలై 19: కుక్కల బెడద, వర్షాకాలం అత్యవసర సమయాల్లో ప్రజలు కార్పొరేషన్‌లోని టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్ రెడ్డి సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాయలయంలో శుక్రవారం నుంచి టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌లో కుక్కలను పట్టుకుంటున్నామని, ప్రజలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప 8074064746, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సందీప్ 9963996908 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆధునిక డ్రైనేజీలు నిర్మించాలి..

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గ్రేటర్ హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ ఆశోక్‌రెడ్డికి ప్రతిపాదనలు అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఖైరతాబాద్‌లో గ్రేటర్ హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ ఆశోక్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో ఆధునిక డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు, రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీలు శిథిలావస్థకు చేరి మురుగు నీటి పారుదలకు సరిపడా సామర్థ్యం లేకుండా పోయాయని పేర్కొన్నారు. జనసాంద్రత పెరగడంతో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయని, సరిపడా కొత్తగా పైపులైన్‌లు వేయాలన్నారు. కొత్త భవనాలకు అనుమతులు ఇవ్వడంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతుందని అన్నారు. కొత్తగా భవనాలకు అనుమతులు ఇవ్వకముందు టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు వాటర్ వర్క్స్ శాఖ నుంచి క్లియరెన్స్ ఇచ్చిన తర్వాతనే అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థతో పాటు వరద నీరు పారడానికి సరైన సౌకర్యం లేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికే మంజూరైన బాక్స్ డ్రైనేజీలతో పాటు కొత్తగా ఆధునిక డ్రైనేజీలు నిర్మించి తాగునీటి పైపులైన్లు వేయాలన్నారు. ఈ విషయమై ఎండీ ఆశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాముయాదవ్, అనిల్‌కిశోర్, రమేశ్, అమీనుద్దిన్, ఢిల్లీ పరమేశ్, శరణగిరి, వెంకటేశ్ యాదవ్, సందీప్ రెడ్డి, సతీశ్, హనుమాన్‌చారి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ డివిజన్‌లో జడ్సీ పర్యటన

మల్లాపూర్ డివిజన్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, అధికారులు

మల్లాపూర్, జూలై 19 : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో శుక్రవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి విన్నవించడంతో జడ్సీ కాలనీల్లో పర్యటించారు. ఓల్డ్ మల్లాపూర్‌లో వివిధ బస్తీల్లో సీసీ రోడ్లు, కౌండిన్య భవన్‌లో పెండింగ్ పనులు, మోడరన్ ధోబీఘాట్, సంజయ్ పార్కులో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన జడ్సీ త్వరలోనే నిధులు మంజూరు చేసి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ హరిలాల్, ఏసీపీ గిరిరాజ్, డీఈ రవిందర్, ఏఈ స్రవంతి, వివిధ విభాగాల అధికారులు బీఆర్ఎస్ నాయకులు పైళ్ల ప్రవీన్, తండా వాసుగౌడ్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల దరఖాస్తుల్లో తప్పుల దిద్దుబాటు

కాప్రా, జులై 19– రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాల్లో ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకాల కోసం గతంలో చేసిన దరఖాస్తుల్లో పొరపాట్ల కారణంగా అర్హులకు లబ్ధి చేకూరలేదు. తప్పులు దొర్లిన వారి దరఖాస్తులను పునఃపరిశీలించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే సమర్పించిన ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాల దరఖాస్తులను కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్‌రావు నగర్, చర్లపల్లి, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలోని వార్డు కార్యాలయాల్లో శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో మళ్లీ పరిశీలించి తప్పులను సరిదిద్దనున్నట్లు సర్కిల్ డీసీ ముకుందరెడ్డి పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 19 : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్, కమిషనర్ రాజమల్లయ్య అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీ ఒకటో వార్డులో శుక్రవారం ఫ్రై డే– డ్రై డే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం వార్డులో మొక్కలు నాటి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నానునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, బస్తీ దవాఖాన డాక్టర్ అలేఖ్య, ఎఎన్ఎం విజయరాణి, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సుప్రభాతం' నాటిక ప్రదర్శన

మల్లాపూర్, జూలై 19 : మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌లో శుక్రవారం రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుప్రభాతం 1231వ నాటిక ప్రదర్శన నిర్వహించారు. బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత మాడుగుల వెంకటకృష్ణమోహన్ రచన, నటన, దర్శకత్వం వహించిన ఈ నాటిక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నది. కవి, రంగస్థల నటుడు ఎఫ్‌డీసీ చారి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రంగస్థల, సినీ నటుడు ఐరేని రమేశ్‌గౌడ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో చిలుక భాస్కర్, మాధవి, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పరిశుభ్రతకు పటిష్ట చర్యలు

సంస్కృతి టౌన్‌షిప్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు

ఘట్‌కేసర్, జూలై 19 : పోచారం మున్సిపాలిటీ 12వ వార్డు సంస్కృతి టౌన్‌షిప్‌లో పరిశుభ్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్, టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరిప్రసాద్ రావు తెలిపారు. వర్షపునీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శుక్రవారం ఫ్రై డే–డ్రై డే కార్యక్రమంలో భాగంగా, కౌన్సిలర్ కాలనీలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో కాలనీలో ఎక్కడా చెత్త, వర్షపు నీరు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ, అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల నరికివేత.. ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు

అన్నోజిగూడలో వరంగల్ రోడ్డు పక్కన నరికివేసిన చెట్లు

ఘట్‌కేసర్, జూలై19 : పోచారం మున్సిపాలిటీ పరిధి వరంగల్ రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పచ్చని చెట్లను నరికివేశారు. అన్నోజిగూడలోని నారాయణ కళాశాల ప్రాంతంలో దాదాపు 15 చెట్లను నరికి వేసినట్లు స్థానిక రియల్ వ్యాపారి బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఫారెస్టు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చెట్లను నరికిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

కీసర, జూలై 19; ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని కీసర మండల స్పెషల్ ఆఫీసర్ పూర్ణిమ తెలిపారు. మండలంలోని రాంపల్లిదాయర ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను స్పెషల్ ఆఫీసర్ పూర్ణిమ, ఎంపీడీవో గ్యామాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో కనీస వసతి సదుపాయాలను కల్పించి సక్రమంగా నిర్వహించా లని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజనంలో ఇబ్బందులేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు సమస్యల్లేకుండా చర్యలు

సోనియాగాంధీనగర్ ఫేజ్–1లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

చర్లపల్లి, జూలై 19 : చర్లపల్లి డివిజన్‌లో వర్షాలతో ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. డివిజన్ పరిధిలోని సోనియా గాంధీనగర్ ఫేజ్–1లో కార్పొరేటర్ పర్యటించి నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాను అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, నాలాలోని వ్యర్థాలు, చెత్తను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య పనులను మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, బాల్‌నర్సింహ, తాండ్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి, జూలై 19 : మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 11కేవీ మౌలాలి ఫీడర్. బీపీ కాలనీ, ఈస్ట్ చంద్రగిరి కాలనీ, గీతాభవాణిల పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 12గంటల వరకు ఆనంద్‌బాగ్ ఈస్ట్, లాల్‌వాణినగర్, జైన్‌మందిర్ ప్రాంతం, పీబీ కాలనీ, సంతోష్‌మానగర్ కాలనీ, చంద్రగిరికాలనీ, సింహాద్రినగర్, వినాయక్‌నగర్, డీమార్ట్, ఓల్డ్ సఫిల్‌గూడ, డీఏవీ పబ్లిక్ స్కూల్, సుధానగర్.. ఉదయం 11నుంచి 12గంటల వరకు ఓల్డ్ మల్కాజిగిరి, వసంతపురికాలనీ, వెంకటేశ్వరనగర్. . ఉదయం11నుంచి 12.30గంటల వరకు వెంకటేశ్వరనగర్, హెచ్‌బీ కాలనీ, ఎల్ఐజీ, ఎంఐజీ, ఈడబ్ల్యూఎస్, ఇందిరానగర్, లక్ష్మి నగర్, జేబీ గార్డన్స్ తదితర కాలనీల్లో.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంట వరకు కైలాసగిరి, మంగళూరం కాలనీ, నవోదయకాలనీ, రాజీవ్‌నగర్, భక్షిగూడ, హెచ్‌బీ కాలనీ ఫేజ్–1, ఎంఐజీ, ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్, ఇందిరానగర్ ఫేజ్–1 లక్ష్మినగర్ కొంత ప్రాంతం... మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు మీర్‌పేట్ తిరుమలనగర్, సాయినగర్ కాలనీ, ఎంఐజీ, తిరుమలనగర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చర్లపల్లి : చర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సబ్‌స్టేషన్ ఏఈలు రవీందర్, పృధ్వీరాజు పేర్కొన్నారు. శుక్రవారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బీఎన్‌రెడ్డినగర్ ఫీడర్, 11కేవీ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఫీడర్, 11కేవీ పెద్ద చర్లపల్లి ఫీడర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్, ఈసీనగర్, మింట్ కాలనీ, మహాలక్ష్మినగర్, వెంకట్‌రెడ్డినగర్, పుక్కట్‌నగర్, మధుసూదన్‌రెడ్డినగర్, సిల్వర్ ఓక్ బంగ్లా, పెద్ద చర్లపల్లి, అదేవిధంగా 11 కేవీ సాయినగర్ ఫీడర్, 11 కేవీ నాగారం ఫీడర్ పరిధిలోని రెడ్డి కాలనీ, సుభాష్‌నగర్, కృష్ణారెడ్డినగర్, సాయినగర్, నాగర్జుననగర్ రోడ్డు నంబర్ 2,3,4,5,6, చక్రీపురం, ఇందిరానగర్, రెడ్డికాలనీ, కట్టింగ్ కాలనీ, మధురానగర్, ద్వారకపురి కాలనీ తదతర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాని వారు తెలిపారు.

ఘట్‌కేసర్, నారపల్లిలో..

ఘట్‌కేసర్ : ఘట్‌కేసర్,నారపల్లి ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు జి.సతీశ్‌కుమార్,వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. అంకుశాపూర్,చౌదరిగూడ 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 గంటల వరకు చౌదరిగూడ, ఏదులాబాద్, కొత్తగూడ గ్రామాల్లో విదుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జి తెలిపారు. నారపల్లి పరిధిలోని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు టౌన్‌షిప్‌లోని డి2, డి3,డి4, సి1సి2,సి3, ఏ24 నుంచి, ఏ35 బ్లాక్‌ల్లో 11:30 నుంచి 12 గంటల వరకు అన్నోజిగూడ,లక్ష్మినర్సింహకాలనీ, ఏఐజీ, జైపూర్ కాలనీలు, సాయినగర్,సూర్యనగర్,ఇందిరానగర్,ఇన్ఫోసెస్,పోచారం,అన్నానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో..

కాప్రా : మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, వెంకటేశ్వరనగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. వెంకటేశ్వరనగర్ కాలనీ, హెచ్‌బీకాలనీ ఫేజ్–2, ఎల్ఐజీ, ఎంఐజీ, ఈడబ్లుఎస్, ఇందిరానగర్, లక్ష్మీ నగర్, జేబీ గార్డెన్స్ వెనుక వైపు కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు. అలాగే 11కేవీ కైలాసగిరి ఫీడర్ పరిధిలోని కైలాసగిరి, నవోదయ నగర్, మంగాపురం కాలనీ, రాజీవ్‌నగర్, బక్షిగూడ, హెచ్‌బీకాలనీ ఫేజ్–1, ఎంఐజీ, ఎల్ఐజీ, ఈడబ్లుఎస్, ఇందిరానగర్ ఫేజ్–1, లక్ష్మీనగర్ పార్ట్ తదితర కాలనీల్లో మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రవీణ్‌రెడ్డి(ఫైల్)

పీర్జాదిగూడ, జూలై 19: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ అశోక్‌నగర్ కాలనీకి చెందిన బానాల ప్రవీణ్‌రెడ్డి(30) ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 14న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..



కళావతి(ఫైల్)

మల్కాజిగిరి, జూలై 19: మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... ఇందిరానగర్‌కు చెందిన కళావతి (70) కొంతకాలంగా మతిస్థిమితం లేక చికిత్స పొందుతుంది. ఈనెల 8న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు అంతట వెతికినా ఆచూకి దొరకలేదు. దీంతో కుమారుడు నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్ఆర్‌పై బొలేరో బోల్తా.. ఇద్దరికి స్వల్ప గాయాలు



కీసర, జూలై 19: కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై బోలేరా వాహనం బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కీసర పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మేడ్చల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్తున్న బొలేరో వాహనం కీసర ఔటర్‌రింగ్ రోడ్డుపై బోల్తా పడింది. దాంతో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతి వేగం, ఓవర్‌లోడ్‌తోనే ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

- ఈ ఏడాది లక్ష్యం రూ. 69.53 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.34.67 కోట్ల వసూలు

జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం

కాప్రా, జూలై 19 : జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా, ఏఎస్ రావు నగర్, చర్లపల్లి, హెచ్‌బీకాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్ల పరిధిలో ఆస్తిపన్ను వసూలు ముమ్మరంగా సాగుతున్నది. గత ఏడాది (2023–2024)కి సంబంధించి ఆస్తిపన్ను లక్ష్యం రూ. 65.63 కోట్లు ఉండగా, రూ.57.94 కోట్లు వసూలైంది. 2024–2025 సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను లక్ష్యం రూ.69.53 కోట్లుగా ఉన్నతాధికారులు నిర్దేశించగా జూలై 18 వరకు 43,861 ఆస్తుల నుంచి రూ. 34.67 కోట్ల ఆస్తిపన్నును అధికారులు, సిబ్బంది వసూలు చేశారు. అంటే ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 50శాతం మేర ఆస్తి పన్ను వసూలు జరిగిందన్నమాట. ఇందులో 5శాతం రిబేటుతో ప్రజలు స్వచ్ఛందంగా చెల్లించిన ఎర్లీ బర్డ్ ఆస్తిపన్ను వసూళ్లు ఎక్కువగా ఉండటం విశేషం. ఏప్రిల్‌లో ఎర్లీబర్డ్ కింద 33,997 ఆస్తుల నుంచి రూ.27.80 కోట్లు వసూలైనట్టు జీహెచ్ఎంసీ వర్గాలు అందజేసిన గణాంకాలు తెలుపుతున్నాయి. మే, జూన్ నెలల్లో 7577 ఆస్తుల నుంచి రూ.5.77 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. జూలై మాసంలో 18వ తేదీ వరకు 2,287 ఆస్తుల నుంచి 1.10 కోట్ల ఆస్తిపన్ను వసూలు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు రూ. 34.67 కోట్ల ఆస్తిపన్ను వసూలైందని అధికారులు వెల్లడించారు. మిగిలిన ఎనిమిది నెలల్లో వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటామని కాప్రా సర్కిల్ డీసీ ముకుందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్లాట్ల విక్రయ స్థలంలో అక్రమ వెంచర్!

- న్యాయం చేయాలంటూ లబ్ధిదారుల ఆందోళన

కీసరలో ఆనంద్‌నగర్ లేవుట్‌ను బాధితులతో కలిసి పరిశీలిస్తున్న పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ నందకిశోర్

కీసర, జూలై 19: తమ ప్లాట్లలో కొందరు అక్రమంగా వెంచర్ వేసి విక్రయించారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగర ప్రాంతానికి చెందిన ఆనంద్‌నగర్ కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సీఎం, కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం కీసర స్పెషల్ ఆఫీసర్ నందకిశోర్, పంచాయతీ కార్యదర్శి గంగన్న విచారణ ప్రారంభించారు.

కీసర మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 368 నుంచి 395 వరకు గల లేవుట్‌లో ప్లాట్ల లబ్ధిదారులతో కలిసి స్పెషల్ ఆఫీసర్ అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం కీసర పంచాయతీ కార్యాలయానికి లబ్ధిదారులంతా చేరుకొని వారి ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను పంచాయతీ అధికారులకు చూపించారు. ఏండ్ల క్రితమే ప్లాట్లను కొనుగోలు చేశామని, అయితే తమ ప్లాట్లలోని కొంతమంది అక్రమార్కులు లే అవుట్‌లను చేసి వేరేవారికి ప్లాట్లను విక్రయించారని వారు ఆరోపించారు. ఈ విషయమై కోర్టుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నామని, కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు. తమ ప్లాట్ల స్థలంలో కొంతమంది లేవుట్ చేసి కొత్త ప్లాట్లను తయారు చేసి విక్రయించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొన్నారని, దాంతో తాము రోడ్డు మీద పడ్డామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ ప్లాట్లను తమకు అందించాలని వారు కోరారు. ప్లాట్ల విషయంపై పూర్తి విచారణ అనంతరం సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని స్పెషల్ ఆఫీసర్ నందకిశోర్ తెలిపారు.

అలియాబాద్‌లో బెల్ట్‌షాపులు తొలగించండి

శామీర్‌పేట, జూలై 19 : బెల్ట్ షాపుల కారణంగా ప్రజలు మద్యపానానికి బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని, వెంటనే వాటిని తొలగించాలని అలియాబాద్ గ్రామస్తులు శుక్రవారం శామీర్‌పేట సీఐ శ్రీనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్ట్ షాపుల కారణంగా ప్రజలు మద్యానికి బానిసలై కోడి కూయకముందే మద్యం షాపుల ఎదుట క్యూ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. బెల్ట్ షాపులు, మందుబాబులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బెల్ట్ షాపులను తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. యువకులు మత్తులో గడపకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేశ్, రాజు, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును అల్వాల్‌కు తరలించాలి

మల్కాజిగిరి, జూలై 19: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బేగంపేట వల్లభ్‌నగర్‌లోని కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ముజీజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, మల్లికార్జున్‌యాదవ్, ఆనంద్, అజిత్‌సాయి, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నాగారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 19 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రాములు, వెంకటేశం, పీఈటీ పాండురంగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో అమ్మవారు..

బోడుప్పల్ ద్వారకానగర్ కొమురమ్మ ఆలయంలో శుక్రవారం శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

శామీర్‌పేట, జూలై 19 : ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీఆర్ఎస్ఎంఏ) గోనే హనుమంత్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం కేశవరం, ఆద్రాస్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 250 మంది విద్యార్థులకు రూ. 25 వేల విలువ చేసే బెల్ట్‌లు, ఐడీకార్డులు, టైలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉష, ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు,రాజశేఖర్, పీడీ గోపాలచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికాలనీలో సమస్యలు పరిష్కరించండి

బోడుప్పల్, జూలై 19 : బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధి లక్ష్మీగణపతికాలనీలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని శుక్రవారం కార్పొరేటర్ కొత్త శ్రీ విద్యచక్రపాణిగౌడ్, కాలనీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి కమిషనర్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు.